క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం

గొల్లపల్లి: జగిత్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక స్వచ్ఛంద సేవా సభ్యులు పొన్నం రాజలింగంగౌడ్ సంయుక్తంగా శ్రీరాములపల్లెలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 105 మందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు చేశారు. రేకుర్తి హాస్పిటల్ టెక్నీషియన్ చింతల ప్రభాకర్ వ్యాధిగ్రస్తులను పరీక్షించగా.. ఉచిత ఆపరేషన్ అవసరమున్న 65 మందిని గుర్తించారు. ఆపరేషన్ కోసం రేకుర్తి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. లయన్ తాటిపాముల వినోద్‌కుమార్, లయన్ శ్రీరాముల సుదర్శన్, లయన్ వడ్లగట్ల శంకర్, గుండేటి గంగాధర్, సామల శ్రీహరి లయన్ సభ్యులు దోపటి దేవదాస్, మానపురి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం శంకర్

ఇబ్రహీంపట్నం: సమాచార హక్కు చట్టం గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరముందని ఏపీఎం శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సమాచార హక్కు చట్టంపై మహిళలకు మండలస్థాయి అధికారులు అవగాహన కల్పించారు. తహసీల్దార్ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మెట్‌పల్లి: బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు గురువారం పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. కోరుట్ల మండలం మాదాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ దారిశెట్టి గణేశ్‌తోపాటు పలువురికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మెట్‌పల్లిరూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పని చేయాలని జువ్వాడి నర్సింగరావు అన్నారు. మెట్లచిట్టాపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అంజిరెడ్డి, ఆనంద్, చిరంజీవి, మహేశ్, రవి, మోహన్‌రావు, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మల్లాపూర్: మారుముల గ్రామానికి చెందిన బడే సునీల్ గ్రూప్–2 ఉద్యోగానికి ఎంపికవడం అభినందనీయమని మాల మహర్ సేన మండల అధ్యక్షుడు పులేరి రాము అన్నారు. గురువారం సాతారంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సునీల్‌ను సన్మానించారు. బీసీ వెల్ఫేర్ అధికారి ఉద్యోగానికి ఎంపికవడం గర్వంగా ఉందని కొనియాడారు. గమిని గంగాధర్, ఉడుగుల గంగాధర్, ఈర రాజేందర్, భూపెల్లి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.


మెట్‌పల్లి: పట్టణంలోని బోయవాడకు చెందిన ఆర్మూర్ శివకుమార్ సీఎం పేషీలో సెక్షన్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. గురువారం గంగపుత్ర గూండ్ల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆర్మూర్ పోచయ్య, రాజేశ్, తోపారపు నాగయ్య, రాజేందర్, గంగారాం, నరేశ్, నితీశ్ తదితరులున్నారు.

పాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీ



మెట్‌పల్లి: పట్టణంలోని పలు పాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ అక్షయ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కొన్ని సెంటర్లలో నిల్వ చేసిన ఆహార పదార్థాలు లభించగా.. వాటిని స్వాధీనం చేసుకున్నారు. మరోసారి ఇలా పట్టుబడితే జరిమానా విధించడంతోపాటు లైసెన్స్ రద్దు చేస్తామని నిర్వాహకులను హెచ్చరించారు. సిబ్బంది శ్రీకాంత్, ముజీబ్, నాయక్ తదితరులున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



జగిత్యాల: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అర్చన, కళాశాల ప్రిన్సిపాల్ అర్చన, మురళి, శ్యామ్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

జగిత్యాలరూరల్: అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న జాబితాపూర్‌కు చెందిన దూస నవ్య నిరుపేద కుటుంబం కావడంతో విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌వోసీని గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు.

అనుమతులు వచ్చేనా..?

- లింకు రోడ్ల అభివృద్ధికి రూ.కోట్లు మంజూరు
- అటవీ శాఖ అనుమతులు రాక నిలిచిపోయిన పనులు
- పట్టించుకోని పాలకులు



కోజన్‌కొత్తూర్‌-వేములకుర్తి మధ్య నిలిచిపోయిన రోడ్డు పనులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు లింకు రోడ్ల అభివృద్ధికి రూ.కోట్లు మంజూరైనా.. లింకు రోడ్ల మధ్యలో ఫారెస్ట్ ఉండడంతో అటవీ శాఖ అనుమతులు రాక రోడ్ల పనులు నిలిచిపోయి ప్రజలు, వాహనాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి యామపూర్ మీదుగా మల్లాపూర్ మండలం నడికుడకు 7 కిలోమీటర్ల లింకు రోడ్డును బాగు చేసేందుకు గాను పీఎం జీఎస్‌వై నిధులు రూ.3.83కోట్లు మంజూరయ్యాయి. 2021లో పనులను ప్రారంభించేందుకు అప్పటి పంచాయతీరాజ్ గ్రామీణ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శంకుస్థాపన చేశారు. కోజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తికి వెళ్లేందుకు డీఎంఎఫ్‌టీ నిధులు రూ.2.20కోట్లు మంజూరు కాగా.. సాయిరాం కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందిన కంట్రాక్టర్ 2018లో పనులను చేపట్టేందుకు అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు శంకుస్థాపన చేశారు. యామపూర్ నుంచి ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి వచ్చేందుకు సుమారు 12 కిలోమీటర్లు రావాల్సి వస్తోంది. ఈ లింకు రోడ్డు పూర్తయితే కేవలం 3 కిలోమీటర్ల దూరంలోనే ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చేరుకోవచ్చు. వేములకుర్తి నుంచి ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి రావడానికి 14 కిలోమీటర్లు. ఈ లింకు రోడ్డు పూర్తయితే కేవలం 6 కిలోమీటర్లలో చేరుకోవచ్చు. కోజన్‌కొత్తూర్ నుంచి వేములకుర్తికి వెళ్లే రోడ్డుకు ఇటువైపు, అటువైపు బీటీ రోడ్డు ఉండగా.. మధ్యలో 1.5కిలోమీటర్ల దూరంలో ఫారెస్ట్ ఉండడంతో 7 సంవత్సరాలుగా అటవీ శాఖ అధికారులు అనుమతులు లేవంటూ రోడ్డు పనులను నిలిపేశారు. ఇబ్రహీంపట్నం నుంచి యామపూర్ మీదుగా నడికుడ వరకు నిర్మించే రోడ్డులో ఇబ్రహీంపట్నం శివారులో 2.2కిలోమీటర్ల దూరం అడవి ఉండడంతో.. అటవీ శాఖ అధికారులు అనుమతులు లేవని పనులు నిలిపేయడంతో సంబంధిత కంట్రాక్టర్ ఫారెస్ట్ వరకు ఫార్మేషన్ పనులను చేసి నిలిపేశారు. సంవత్సరాలు గడుస్తున్నా అనుమతులు రాక రోడ్ల పనులు నిలిచి కాంట్రాక్టర్లు, ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు పట్టించుకొని అటవీ శాఖ అనుమతులు తీసుకొచ్చి లింకు రోడ్ల పనులు పూర్తయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఈ ప్రభుత్వంలోనైనా..

గత ప్రభుత్వంలో అటవీ శాఖ అధికారులు లింకు రోడ్లు అభివృద్ధి చేసేందుకు అనుమతులు ఇవ్వలేదు. కనీసం ఈ ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టించుకొని అటవీ శాఖ అనుమతులు వచ్చేలా చర్యలు చేపట్టాలి. లేకుంటే లింకు రోడ్ల అభివృద్ధికి మంజూరైన రూ.కోట్ల నిధులు తిరిగి వెళ్లే పరిస్థితి నెలకొంది.

దూరం తగ్గుతుంది



ఇబ్రహీంపట్నం, యామపూర్ లింకు రోడ్డు పూర్తయితే మండల కేంద్రానికి, వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు ధాన్యం తీసుకురావడానికి దూరభారం తగ్గుతుంది. ఎంపీ, ఎమ్మెల్యే చొరవ చూపి అటవీ శాఖ అనుమతులు తీసుకొచ్చి రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.

– నాగేశ్, యామపూర్

చొరవ చూపాలి



కోజన్‌కొత్తూర్, వేములకుర్తి లింక్ రోడ్డు పనులు చేపట్టేందుకు అటవీ శాఖ అధికారుల అనుమతి వచ్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. ఈ ప్రభుత్వంలోని నాయకులపై ఒత్తిడి తెచ్చి అనుమతి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– రాదారపు దేవదాస్, వేములకుర్తి

అనుమతులు వస్తే పనులు ప్రారంభం



ఇబ్రహీంపట్నం నుంచి యామపూర్ మీదుగా మల్లాపూర్ మండలం నడికుడ వరకు నిర్మించే లింకు రోడ్డు మధ్యలో ఫారెస్ట్ ఉంది. కోజన్‌కొత్తూర్–వేములకుర్తి మధ్యలో ఫారెస్ట్ ఉండడంతో అటవీ శాఖ అధికారుల అనుమతి లేక రోడ్లు పనులు నిలిచిపోయాయి. అటవీ శాఖ అధికారులు అనుమతి ఇస్తే రోడ్ల పనులు ప్రారంభమవుతాయి.

– అభినవ్, పంచాయతీరాజ్ ఏఈ, ఇబ్రహీంపట్నం

పకడ్బందీగా నామినేషన్ల స్వీకరణ



నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/మెట్‌పల్లిరూరల్: స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. గురువారం మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులు ఏమైనా సందేహాలు ఉంటే అక్కడ నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ నెల 9 నుంచి 11 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. చివరి రోజు ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు రమేశ్‌గౌడ్, వరప్రసాద్, ఎంపీడీవోలు శశికుమార్ రెడ్డి, మహ్మద్ సలీమ్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్/కోరుట్లరూరల్/సారంగాపూర్/రాయికల్: కథలాపూర్, కోరుట్లరూరల్ మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తనిఖీ చేశారు. అభ్యర్థుల నామినేషన్లు క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్ మండల పరిషత్ కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలను డీపీవో మదన్‌మోహన్, ఆర్డీవో మధుసూదన్ పరిశీలించారు. నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

అధికారులతో సమావేశం

బుగ్గారం: మండల రిటర్నింగ్ ఆఫీసర్‌గా నియమితులైన ఇ.మురళి గురువారం స్థానిక అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు.

ప్రాధాన్యమివ్వాలి

జగిత్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెజిటెడ్ జూనియర్ లెక్చరర్లకు ప్రాధాన్యం కల్పించాలని గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ సంఘాల నాయకులు కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కొట్టాల తిరుపతిరెడ్డి, అత్తినేని శ్రీనివాస్, విజేందర్ రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బాకీ కార్డును ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బాకీ కార్డు విడుదల చేస్తున్న మాజీ మంత్రి

ధర్మపురి: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను బాకీ కార్డుల రూపంలో తయారు చేసి ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అమలు కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలే గుణపాఠం చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, నాయకులు అయ్యోరి రాజేశ్, ఇందారపు రామన్న, సొల్ల భీమయ్య తదితరులున్నారు.

సారంగాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జరగాలంటే 9వ షెడ్యూల్‌లో చేర్చి ప్రొటెక్షన్ కోసం రాజ్యాంగ సవరణ జరగాలని బీఆర్ఎస్ ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వానికి మొదటి నుంచి చెబుతూ వస్తోందని జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. గురువారం పెంబట్ల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు అందించారు. తేలు రాజు, సాగి సత్యంరావు, అనంతుల గంగారెడ్డి, ఎండబెట్ల ప్రసాద్, భైరి మల్లేశం, సాంబారి గంగాధర్, కొండ ప్రభాకర్, భూక్య సంతోష్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కథలాపూర్: బొమ్మెన గ్రామ శివారులో వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 2 ట్రాక్టర్లు పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. పోలీస్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా.. బొమ్మెన వాగులో నుంచి ఇసుకను తీసుకెళ్తున్న ట్రాక్టర్లు కనిపించాయన్నారు. ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించామని అన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెగడపల్లి: బతికపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు గురువారం ఎస్‌ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఆరుగురి వద్ద రూ.8,850 నగదుతోపాటు 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మోసం చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య



కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కోరుట్లరూరల్: ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ 20 నెలల పాలనలో ప్రజలందరూ విసిగిపోయారని వివరించారు. బాధ్యత కలిగిన పార్టీగా బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మేడిపల్లి: అఖిల భారత యాదవ మహాసభ మండల యూత్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జింక మధుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఒలుపుల రవీందర్‌యాదవ్ ఎన్నికయ్యారు.

పరామర్శ

మల్లాపూర్: మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ వేంపేట నర్సారెడ్డి కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కిసాన్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి పరామర్శించారు. నర్సారెడ్డి తల్లి నర్సవ్వ ఈనెల 8న మృతిచెందింది. పూంద్ర శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సిరిపురం రవీందర్, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ అభియాన్



రాయికల్: మైతాపూర్ గ్రామంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తల్లులు, గర్భిణులకు పోషకాహార పదార్థాలపై సూపర్‌వైజర్ పద్మావతి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు శాంత, ప్రవంతి, మమత, పద్మాలత పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. జాబితాపూర్, పొలాస, గుల్లపేట గ్రామాల్లో పోషణ మాసం సందర్భంగా చక్కెర, నూనె తగ్గించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సౌజన్య, జమున, స్వరూప, కళావతి, శారద, స్వప్న, ప్రేమలత పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. జిల్లా సంక్షేమాధికారి డాక్టర్.బి.నరేశ్, మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ హాజరయ్యారు. మల్యాల, ముత్యంపేట సెక్టార్‌లోని గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు.

నేడు మహా ధర్నా

మెట్‌పల్లి: జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో రైతు మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. నాయకులు క్యాతం సంజీవ్, ఎలిసె పాపన్న, మారు మురళీధర్‌రెడ్డి ఉన్నారు.

కథలాపూర్: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో మెట్‌పల్లిలో శుక్రవారం నిర్వహించే రైతు ధర్నాకు రైతులు తరలిరావాలని రైతు ఐక్యవేదిక జిల్లా నాయకుడు బద్దం మహేందర్‌రెడ్డి కోరారు. గురువారం కథలాపూర్‌లో రైతులతో కలిసి మాట్లాడారు. నాయకులు నల్ల రమేశ్‌రెడ్డి, మారు మురళిధర్‌రెడ్డి, పాపన్న, బెజ్జారపు శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

వెల్గటూర్: ప్రభుత్వం ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బెస్ట్ అవైలెబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి రాజారాంపల్లి చౌరస్తా వద్ద 7వ నంబర్ రాష్ట్ర రహదారిపై గురువారం ధర్నా నిర్వహించారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



మల్లాపూర్: వెంకట్రావ్‌పేటలోని పలు కాలనీల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి బురదమయంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదేళ్లుగా వర్షాకాలంలో వరద నీరుతోపాటు ఆ రోడ్లపై నుంచే మురుగు నీరు కూడా ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతోంది. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సురేశ్, పంచాయతీ కార్యదర్శి, వెంకట్రావ్‌పేట, సెల్ నంబర్: 9299709717

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



పొలం బాట కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఇబ్రహీంపట్నం: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ సతీశ్ సూచించారు. గురువారం కేశాపూర్ గ్రామంలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు కెపాసిటర్లు బిగించుకొని విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: రైతులు వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ దివాకర్ రావు సూచించారు. బొమ్మెన గ్రామంలో ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. సబ్ ఇంజినీర్ నవీన్, లైన్‌మెన్ భూమేశ్వర్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

మల్లాపూర్: పొలం బాట కార్యక్రమంతో రైతుల చెంతకే విద్యుత్ శాఖ అధికారులు వెళ్లి సమస్యల పరిష్కారానికి పూనుకున్నారు. గురువారం గొర్రెపల్లి గ్రామాన్ని ఎన్పీడీసీఎల్ ఏడీఈ ప్రదీప్ నేతృత్వంలో విద్యుత్ శాఖ అధికారులు సందర్శించారు. మల్లాపూర్ ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డి, రాఘవపేట ఏఈ సంతోష్, రైతులు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

మేడిపల్లి: మన్నెగూడెం అసిస్టెంట్ ఇంజనీర్ బండారి అశోక్ ఆధ్వర్యంలో మన్నెగూడెం గ్రామంలో విద్యుత్ శాఖ పొలం బాట కార్యక్రమం నిర్వహించింది. ఏఈ అశోక్ రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మన్నెగూడెం సబ్ ఇంజనీర్ హరిప్రసాద్, లైన్‌మెన్ సంపత్, అసిస్టెంట్ లైనమెన్ గణేశ్, జలందర్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ముత్యంపేటలో అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సబ్ పోస్టు మాస్టర్ యెన్నం శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ముత్యంపేటలో తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ బీమా పథకాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. అధికారులు చంద్రమౌళి, భూమయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జగిత్యాలరూరల్: కండ్లపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఇందుప్రియ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ అజీమ్ తెలిపారు. ఈనెల 8న కరీంనగర్‌లో జరిగిన అండర్–19 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చిందన్నారు. ప్రిన్సిపాల్ సరితదేవి, వైస్ ప్రిన్సిపాల్ నగేశ్ అభినందించారు.

మల్యాల: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ కనబర్చారు. అండర్–17 బాలికల విభాగంలో వాలీబాల్, ఖోఖో, అండర్–14 బాలికల విభాగంలో కబడ్డీలో విజేతలుగా నిలిచారు. పీడీ పడాల విశ్వప్రసాద్, మధులిక, శేఖర్, సింధూ, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం



తలపడుతున్న క్రీడాకారులు

జగిత్యాలటౌన్: కరాటేతో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం కలుగుతుందని, క్రీడాకారులు ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకోచ్చని ఎస్జీఎఫ్ సెక్రటరీ చక్రధర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్‌లో జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ కరాటే పోటీలను ప్రారంభించి మాట్లాడారు. 150 మంది క్రీడాకారులు పోటీ పడగా.. కరీంనగర్ జిల్లా స్థాయికి ఎంపికయిందన్నారు. పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, ఎస్జీఎఫ్ మాజీ సెక్రటరీలు శ్రీనివాస్, లక్ష్మీరాంనాయక్ తదితరులు హాజరయ్యారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు



బహుమతులు అందిస్తున్న మండల విద్యాధికారి

జగిత్యాలటౌన్: జిల్లాస్థాయి పాఠశాల క్రీడాపోటీలు గురువారం మూడోరోజు కొనసాగాయి. అండర్–14 బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ మొదటి స్థానంలో మల్యాల, రెండో స్థానంలో రాయికల్, వాలీబాల్ మొదటి స్థానంలో సారంగాపూర్, ద్వితీయ స్థానంలో జగిత్యాల అర్బన్, ఖోఖో మొదటి స్థానంలో కోరుట్ల, ద్వితీయ స్థానంలో మెట్‌పల్లి నిలిచాయని జిల్లా విద్యాధికారి రాము తెలిపారు. జగిత్యాల అర్బన్ మండల విద్యాధికారి చంద్రకళ విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా క్రీడల కార్యదర్శి చక్రధర్‌రావు, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, అశోక్, పడాల కృష్ణప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మీరాం నాయక్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.